# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 26, జూన్ 2026


# విద్యుత్ మౌలిక సదుపాయాలే లక్ష్యం

❖ కాగజ్‌నగర్‌లో సీఎండీ వరుణ్ రెడ్డి పర్యటన

❖ ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాకు ఇంటర్‌లింకింగ్ లైన్లు.. భద్రతపై ప్రత్యేక దృష్టి



**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 25, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ డివిజన్‌లో గురువారం టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసి వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే సంస్థ లక్ష్యమని తెలిపారు. దహెగాం-కన్నెపల్లి మధ్య నిర్మిస్తున్న 20 కిలోమీటర్ల ఇంటర్‌లింకింగ్ లైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ లైన్ వారం రోజుల్లో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. దీంతో దహెగాం, పెంచికల్‌పేట్ పరిసర ప్రాంతాలకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా లభించి, సాంకేతిక లోపాలు లేదా భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గుతాయని పేర్కొన్నారు.అనంతరం బెజ్జూరు, దహెగాం, కౌటాల, సిర్పూర్(టి) 33/11 కేవీ సబ్‌స్టేషన్లను సందర్శించిన సీఎండీ, అక్కడ చేపట్టిన ఆర్ అండ్ ఎం పనులను అభినందించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భద్రతా పరికరాలు లేకుండా పనులు చేయరాదని, ఎల్‌సీ యాప్ ద్వారానే లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) తీసుకోవాలని ఆదేశించారు.పనులు ప్రారంభించే ముందు ప్రతి ఉద్యోగి ఒక నిమిషం సమయం తీసుకుని భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యమే ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉందని, ఒక్క నిమిషం జాగ్రత్త సిబ్బంది ప్రాణాలను కాపాడగలదని చెప్పారు. ప్రమాదకరంగా ఉన్న లైన్లు, వంగిన విద్యుత్ స్తంభాలను వెంటనే సరిచేయాలని, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలను ఎత్తు పెంచాలని, లూజ్ లైన్లకు మధ్య స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అటవీ ప్రాంతంలోని వేంపల్లి-పెద్దబండ, సారసాల-ఎల్కపల్లి మధ్య సుమారు 19 కిలోమీటర్ల మేర కవర్డ్ కండక్టర్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడడం వల్ల ఏర్పడే అంతరాయాలను నివారించడంలో ఇవి ఉపయోగపడతాయని వివరించారు. అలాగే బెజ్జూరు-కర్జవల్లి మధ్య 20 కిలోమీటర్ల ఇంటర్‌లింకింగ్ లైన్ పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో డివిజినల్ ఇంజనీర్ సి. నాగరాజు, డీఈ (టెక్నికల్) సుధాకర్, ఈఈ (సివిల్) శ్రీనివాస్, ఏడీఈలు, ఏఈలు తదితర ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుడి గొంతు కోసి

# దారుణహత్య

✷ బాలికను వేధించిన వ్యక్తిని మందలించడంతో కక్ష పెంచుకున్న ముగ్గురు..

✷ మద్యం తాగించి గుట్టపైకి తీసుకెళ్లి హత్య

**మంచిర్యాల, జూన్ 25, ప్రభాతవార్త**




మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని అండాలమ్మ కాలనీ సమీప గుట్ట వద్ద గురువారం ఒక యువకుడి మృతదేహం లభించడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారుడు దారావత్ వీరన్న సమాచారం మేరకు మృతుడు బానోతు లక్పతి అలియాస్ చిన్న 29 మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలానికి చెందిన వ్యక్తిగా అతను గత రెండు నెలలుగా బత్తుల పద్మ ఇంటి వద్ద అండలమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. బత్తుల పద్మ మనవరాలును వెంకటేష్ అలియాస్ బన్నీ అనే వ్యక్తి తరచూ వెంబడిస్తూ వేధిస్తున్నాడని, ఈ విషయం తెలుసుకున్న లక్పతి వెంకటేష్‌ను మందలించినట్లు సమాచారం. దీంతో లక్పతిపై వెంకటేష్ కక్ష పెంచుకున్నాడు.ఈ క్రమంలో వెంకటేష్ తన స్నేహితులు ఆలకుంట వినోద్, నరసింహులతో కలిసి పథకం రచించినట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురు కలిసి లక్పతికి మద్యం తాగించి అండలమ్మ కాలనీ డంపింగ్ యార్డు సమీపంలోని గుట్టపైకి తీసుకెళ్లి, పదునైన ఆయుధంతో గొంతు కోసి హత్య చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పట్టణ సీఐ ప్రమోద్ రావు తెలిపారు.

# పూర్తి అంశాలతో డాక్యుమెంట్ చేయాలి

✪ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్

**నస్పూర్, జూన్ 25, ప్రభాతవార్త**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ఫలితాలు, భవిష్యత్తు కార్యచరణపై నివేదిక సిద్ధం చేయాలని, ప్రజల వినతులు, సమస్యల పరిష్కారం, పెండింగ్ అంశాలపై డాక్యుమెంట్ రూపొందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో 99 రోజుల పాటు చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులకు సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ప్రతి గ్రామంలో 4 రకాల చెత్త నిర్వహణ చేపట్టాలని, వ్యర్థాల నుంచి ఉపయోగకర ఉత్పత్తుల తయారీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణ కొరకు పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి మిగతా 2లో..



# డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే బంగారు భవిష్యత్: ఎస్పీ




✪ కాగజ్‌నగర్ ఫాతిమా హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన.. షార్ట్ ఫిలిమ్స్ ప్రదర్శన

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 25, ప్రభాతవార్త :**

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ భవిష్యత్తుపైనా తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల నాడీ వ్యవస్థ దెబ్బతినడంతో పాటు శారీరక, మానసిక, సామాజిక సమస్యలు తలెత్తుతాయని వివరించారు. విద్యార్థి దశలోనే చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు, విక్రయిస్తున్నట్లు లేదా అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే 1908 డ్రగ్స్ కంట్రోల్ హెల్ప్‌లైన్, మిగతా 2లో..

# పూర్తి అంశాలతో డాక్యుమెంట్ చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**

ధనసరి అనసూయ (సీతక్క) ఆధ్వర్యంలో తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, ఇందులో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరిలో ఊట కుంట ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, దాదాపు 50 లక్షల మంది మహిళలకు పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు తయారుచేసే అవకాశాన్ని స్వయం సహాయక సంఘాలకు కల్పించి ఆదాయ వనరులను పెంపొందించడం జరిగిందని తెలిపారు. దాదాపు 1 లక్ష మంది విద్యార్థులకు దుస్తులు అందించడం జరిగిందని, విద్యా సంస్థల సమీపంలో ఎలాంటి మురికి ప్రాంతాలు లేకుండా శుభ్రపరచాలని తెలిపారు. మాదకద్రవ్యాలు, గంజాయి వంటి హానికర పదార్థాలను పూర్తిగా నిరోధించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పంట మార్పిడి విధానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పంట మార్పిడి వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని, అదనపు ఆదాయాన్ని వృద్ధి చేసుకునేలా అవసరమైన మెలకువలు అందించాలని తెలిపారు. విద్య ఆవశ్యకతను తెలుసుకొని ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ చర్యలు తీసుకుంటుందని, ప్రతి ఒక్కరూ చదువుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో విద్యారంగంలో అమలు చేస్తున్న విధానాలు అభినందనీయమని, భవిష్యత్తులో ఇలాగే కొనసాగించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో సెంట్రింగ్ యూనిట్లు, ఫ్లై యాష్ బ్రిక్స్ యూనిట్ల ఏర్పాటుతో పాటు ఇతర వ్యాపార రంగాలలో రాణించేలా చేయూత అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. త్వరలో ప్రభుత్వం పింఛన్ల విషయంలో ప్రజలకు శుభవార్త చెబుతుందని, పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల జీవన ప్రామాణీకరణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఇన్స్టంట్ స్వాప్ పెన్షన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని, ఈ క్రమంలో ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, సంబంధిత పరిష్కార నివేదిక పత్రాలను పోర్టల్ లో నమోదు చేయాలని, సమస్యల పరిష్కార విధానం నిజాయితీగా, పారదర్శకంగా ఉండాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 3 వేల 73 మంది వ్యాధిగ్రస్తులను పరీక్షించి 251 మంది చిన్నపిల్లల వైద్య నిపుణుల ద్వారా అందించడం జరిగిందని, క్షయ నిర్మూలనలో భాగంగా 3 వేల 190 మంది అనుమానితులకు ఎక్స్ రే తీసి 89 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. యాంటీబయోటిక్ అధిక వినియోగంపై నియంత్రణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అధిక మొత్తంలో సదరం శిబిరాలలో దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. అరైవ్ అలైవ్ లో భాగంగా రహదారి భద్రతా నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరచడం జరిగిందని, ప్రమాద ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వెనుకబడిన తరగతులు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలోని వసతి గృహాలలో పారిశుధ్యం, ఆహార నాణ్యత, విద్యార్థుల సంక్షేమంపై చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. బడిబాట కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థుల సంఖ్య పెంపొందించడం జరిగిందని, జిల్లాలో బాలికల విద్య పై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో భోజనశాల, అదనపు గదుల నిర్మాణం చేపట్టి అవసరమైన సామాగ్రి సమకూర్చడం జరిగిందని, ఈ విద్యాలయాలలో పరిమితికి మించి అడ్మిషన్లు అందించి విద్యాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనాథలు, ఒక తల్లి/తండ్రి గల పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, నిత్యవసరాలు అందించడం జరుగుతుందని తెలిపారు. రైతు వేదికలలో సమావేశాలు నిర్వహించి భూసార పెంపుదల, ఎరువుల బుకింగ్, ప్రకృతి వ్యవసాయం, ఉద్యానవన పంటలు, పంట మార్పిడి విధానాలపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ఇప్పటివరకు 10 వేల 305 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, 2 వేల 132 ఇండ్లు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని, మిగతా పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వి.బి.జి. రాంజీ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అధికారులు తమ పరిధిలోని గ్రామపంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు అందించాలని, త్వరలో కార్మికులకు బీమా సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, కుక్కలు, కోతుల బెడద నివారణ పై చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీధి దీపాల మార్పిడిలో అక్రమాలకు తావు లేకుండా పర్యవేక్షించడంతో పాటు సోలార్ విద్యుత్ ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ ఆర్థిక వనరుల అభివృద్ధి దిశగా ప్రణాళిక రూపొందించుకుని తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**లక్షెట్టిపేట, జూన్ 25, ప్రభాతవార్త**

ప్రజా ఆరోగ్యం దృష్ట్యా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ఈ క్రమంలో ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వార్డులు, రిజిస్టర్లు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించి అధిక శాతం నమోదు అవుతున్న వ్యాధులు, అందిస్తున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య రంగ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలను ఆధునికరిస్తూ, ఆధునిక సాంకేతిక పరికరాలను సమకూర్చి ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలం అయినందున వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన మందుల నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యా రంగంలో ఆదరణాత్మక మార్పులను తీసుకువస్తూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని వెంకటరావుపేట గ్రామంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులకు కార్యక్రమం నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం, తిరిగి సేకరించడం, వివరాల నమోదు అంశాలలో జాగ్రత్త వహించాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సందర్శించి తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు రాజ్యాధికార సమరభేరి సభ ఆహ్వాన పత్రిక అందజేత

**భైంసా, జూన్ 25, ప్రభాతవార్త:**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జూలై 5వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించబోయే ప్రతిష్టాత్మక రాజ్యాధికార సమరభేరి సభకు హాజరు కావాలని కోరుతూ ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. భైంసా పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ కొమ్ముల ప్రవీణ్ రాజ్, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు గైని సాయి మోహన్ ఇతర ముఖ్య నాయకులతో కలిసి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఈ ఆహ్వానాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా టీఆర్పీ నాయకులు మాట్లాడుతూ.. భువనగిరి జిల్లాలో జూలై 5న జరగబోయే రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభను విజయవంతం చేయడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బహుజనుల రాజ్యాధికార సాధన ధ్యేయంగా నిర్వహిస్తున్న ఈ మహాసభకు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ విచ్చేసి విజయవంతం చేయాలని కోరినట్లు వివరించారు. ఈ ఆహ్వాన పత్రిక అందజేసిన కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జెడ్ లోడ్ శంకర్, మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, పార్టీ ముఖ్య నాయకులు మారుతి, వివిధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే బంగారు భవిష్యత్: ఎస్పీ

**(మొదటిపేజీ తరువాయి)**

112 ఎమర్జెన్సీ నంబర్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ సందర్భంగా డ్రగ్స్ దుష్ప్రభావాలపై రూపొందించిన షార్ట్ ఫిలిమ్స్‌ను విద్యార్థులకు ప్రదర్శించి అవగాహన కల్పించారు. అనంతరం ఇగో టు డ్రగ్స్ యస్ టు లైఫ్ అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫ్లోరీ, మేనేజర్ మెరిటా, ఇన్స్పెక్టర్లు ప్రేమ్‌కుమార్, కుమారస్వామి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో సిర్పూర్(టి)లో ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు

### - మండలంలోని అన్ని గ్రామాలకు వినియోగించుకోవాలని

**యూనిటీ సభ్యుల విజ్ఞప్తి**

**సిర్పూర్(టి), జూన్ 25, ప్రభాతవార్త :**



సిర్పూర్(టి) మండల కేంద్రంలో ఫ్రీజర్ బాక్స్ అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో దాతల సహకారంతో సిర్పూర్(టి)లో ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు చేశారు. సిర్పూర్(టి) యూనిటీ ఆధ్వర్యంలో వారం రోజుల క్రితం సోషల్ మీడియా ద్వారా మండల కేంద్రంలో ఫ్రీజర్ బాక్స్ అవసరాన్ని తెలియజేస్తూ ప్రజలకు విజ్ఞప్తి చేయగా విశేష స్పందన లభించింది. సిర్పూర్(టి) గ్రామానికి చెందిన దాతలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు కూడా ఉదారంగా విరాళాలు అందించి ఫ్రీజర్ బాక్స్ కొనుగోలుకు సహకరించారు. వారి సహకారంతో ఫ్రీజర్ బాక్స్‌ను మండల కేంద్రంలో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు యూనిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సహకరించిన ప్రతి దాతకు, గ్రామస్తులకు యూనిటీ సభ్యులు పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఫ్రీజర్ బాక్స్‌ను సిర్పూర్(టి) మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు అవసరమైన సమయంలో వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ సేవ అందుబాటులో ఉంటుందని తెలిపారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి సహకరించిన దాతల సేవాభావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని యూనిటీ సభ్యులు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మరిన్ని సేవా కార్యక్రమాలను కూడా భవిష్యత్తులో చేపట్టనున్నట్లు వెల్లడించారు.

## ఉద్యోగుల ఆరోగ్యమే లక్ష్యం.. రైల్వే స్టేషన్‌లో ఉచిత వైద్య శిబిరం

### - దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘం ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు

**సిర్పూర్(టి), ప్రభాతవార్త**



దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘం (ఎస్‌సిఆర్ఈయూ) కాగజ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో గురువారం సిర్పూర్(టి) రైల్వే స్టేషన్‌లో రైల్వే ఉద్యోగుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యురాలు డాక్టర్ ప్రణీత రైల్వే ఉద్యోగులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో రక్తపోటు, సాధారణ ఆరోగ్య పరిస్థితులు తదితర అంశాలను పరీక్షించి అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఆర్ఈయూ కాగజ్‌నగర్ బ్రాంచ్ కార్యదర్శి వై. సతీష్ నాయుడు, అసిస్టెంట్ కార్యదర్శి ఎస్. సాంబయ్య, ఎం. సుధాకర్, కోశాధికారి తిరుపతి, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి శివతో పాటు సంఘం ప్రతినిధులు, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కూరగాయల విత్తనాల పంపిణీ

**సారంగాపూర్, జూన్ 25, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని సాయినగర్ తండాలో బుధవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో కూరగాయల విత్తనాల మినీ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవన శాఖ అధికారి మోనిక సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక రైతులకు, మహిళలకు కూరగాయల సాగు పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు రాయితీపై విత్తన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యానవన అధికారి మోనిక మాట్లాడుతూ..

రైతులు, గ్రామీణ మహిళలు తమ ఇంటి అవసరాలకు సరిపడా కూరగాయలను పెరటి తోటల రూపంలో స్వయంగా పండించుకోవాలని సూచించారు. రసాయన ఎరువులు లేకుండా సేంద్రీయ పద్ధతిలో ఇంట్లోనే కూరగాయలు సాగు చేయడం వల్ల కుటుంబ ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని, మార్కెట్ ఖర్చులు కూడా తగ్గుతాయని వివరించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న ఈ అవకాశాన్ని తండాలోని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయినగర్ తండా సర్పంచ్ సబ్లె సరిత దేవి సింగ్, రాథోడ్ రవిందర్, వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# మాతా శిశు సంరక్షణ సేవలు, ఉచిత పరీక్షలపై జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీ

## - మంచిర్యాల మాతా శిశు కేంద్రం, పాలియేటివ్ కేర్ సెంటర్, తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రాల్లో సేవల సమీక్ష

## - ప్రజలకు 72 రకాల ఉచిత పరీక్షలు అందుబాటులో..

**మంచిర్యాల, జూన్ 25, ప్రభాతవార్త**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ గురువారం మంచిర్యాలలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం, పాలియేటివ్ కేర్ సెంటర్, తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీధర్, నిపుణ వైద్యులు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, గర్భిణీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, శిశు సంరక్షణలో తీసుకుంటున్న జాగ్రత్తలను జిల్లా వైద్యాధికారి పరిశీలించారు.



దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు హెల్ప్ డెస్క్ ఎంతో ఉపయోగకరమని, గర్భిణీలు మరియు వారి కుటుంబ సభ్యులు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మే నెలలో కేంద్రంలో మొత్తం 342 ప్రసవాలు నమోదయ్యాయని, వాటిలో 137 సాధారణ ప్రసవాలు, 205 శస్త్రచికిత్స ద్వారా ప్రసవాలు జరిగినట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు అన్ని పరీక్షలు నిర్వహించి మాతా శిశు సంరక్షణ కార్డులు నమోదు చేసి పంపించాలని, అధిక ప్రమాద గర్భిణీల వివరాలను హెల్ప్ డెస్క్‌కు ముందుగానే తెలియజేయాలని ఆదేశించారు. కేంద్రంలో స్త్రీ వైద్య నిపుణులు, శిశు వైద్య నిపుణులు అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, సమస్యలు ఏవైనా ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం రోగులకు అందిస్తున్న సేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పాలియేటివ్ కేర్ కేంద్రంలో క్యాన్సర్ రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్‌తో సమీక్ష నిర్వహించారు. అలాగే తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రంలో జరుగుతున్న పరీక్షలను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. డాక్టర్ సృజన, తెలంగాణ డయాగ్నస్టిక్స్ మేనేజర్ వెంకటేష్, ల్యాబ్ టెక్నీషియన్లతో నిర్వహించిన సమీక్షలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రి నుంచి వచ్చే రక్త నమూనాల పరీక్షలు మరియు నివేదికల పంపిణీపై చర్చించారు. డెంగ్యూ నిర్ధారణకు వినియోగిస్తున్న ఎలిసా యంత్రాన్ని కూడా పరిశీలించారు. ప్రజలకు అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా ఉచితంగా 72 రకాల పరీక్షలు అందిస్తున్నామని జిల్లా వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వాతి, రాజమణి, నర్సింగ్ అధికారులు, వైద్య సిబ్బంది, హెల్ప్ డెస్క్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

# దివ్యాంగుల బడి బాట శిబిరాలు ఎంతో ఉపయోగకరం

## - ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



మాట్లాడుతున్న ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్

**భైంసా, జూన్ 25, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలో స్నేహా సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల బడి బాట 2026 కార్యక్రమానికి ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ.. దివ్యాంగుల పిల్లలకు నాణ్యమైన విద్య, వైద్యం, పునరావాస సేవలు అందించడంలో ఈ బడి బాట శిబిరాలు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను సకాలంలో గుర్తించి, వారికి అవసరమైన సహాయ పరికరాలు, విద్యా అవకాశాలు కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. శారీరక, మానసిక లోపాలు ఉన్నాయని పిల్లలను ఇంట్లోనే ఉంచేయకుండా, తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలను పాఠశాలలకు పంపించి విద్యావంతులను చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రతి అర్హత కలిగిన కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భైంసా మున్సిపల్ చైర్మన్ తుమోళ్ళ దత్తు, మండల విద్యాధికారి, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ప్రత్యేక పాఠశాల నిర్వాహకులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వాలే: రఘునాథ్ వేరబెల్లి

## - అత్యవసర పరిస్థితి చీకటి రోజులను గుర్తు చేస్తూ మంచిర్యాలలో ర్యాలీ, మౌన నిరసన

**మంచిర్యాల, జూన్ 2, ప్రభాతవార్త**

దేశంలో 1975 జూన్ 25న విధించిన అత్యవసర పరిస్థితికి 51 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ చీకటి రోజులను స్మరించుకుంటూ మంచిర్యాల పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మోన నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వేరబెల్లి మాట్లాడుతూ, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ఖూనీ చేసింది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. అత్యవసర పరిస్థితి పేరుతో దేశంలోని రాజకీయ పార్టీల నాయకులు, పాత్రికేయులు, ప్రజాసంఘాల ప్రతినిధులను జైళ్లలో నిర్బంధించి ప్రజాస్వామ్యాన్ని అణచి వేసిందని విమర్శించారు. ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితిని ఆసరాగా చేసుకొని రెండు సంవత్సరాల పాటు ప్రధానమంత్రిగా కొనసాగారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన పలు రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసి రాజ్యాంగ విలువలను కాంగ్రెస్ పార్టీ దెబ్బతీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులే ప్రస్తుతం మంచిర్యాల నియోజకవర్గంలో కూడా కనిపిస్తున్నాయని ఆయన అన్నారు. శాసనసభ్యులు ప్రేమ్ సాగర్ రావు కూల్చివేతలను ప్రధానంగా తీసుకొని భారీ స్థాయిలో వ్యవహారాలు నడుపుతున్నారని ఆరోపించారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికి తీయాలని డిమాండ్ చేశారు. చిరు వ్యాపారులను రోడ్డున పడేసిన పరిస్థితులకు స్థానిక ప్రజాప్రతినిధులే బాధ్యత వహించాలని ఆయన అన్నారు. ప్రజల జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను వెంటనే నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగునూరి వెంకటేశ్వర గౌడ్, గాజ్జుల ముఖేష్ గౌడ్, దుర్గం అశోక్, నాగరాజు, బొట్ల సత్యం, జోగుల శ్రీదేవి, పచ్చ స్వప్నరాణి, అమ్మిరిశెట్టి రాజ్‌కుమార్, తదితర నాయకులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# ఘనంగా ప్రారంభమైన ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ

## - ఇంటింటికీ ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ

## - బెల్లంపల్లి తహసిల్దార్ కృష్ణ రావు

**బెల్లంపల్లి, జూన్ 25, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి నిర్వహించే ఎస్.ఐ.ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ డివిజన్) ప్రక్రియను ఈరోజు ఘనంగా ప్రారంభించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బెల్లంపల్లి పట్టణంలోని రామాలయం పరిధిలోని 51వ బూత్ ఏరియాలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాసిల్దార్ కృష్ణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రక్రియను ప్రారంభించారు. అలాగే బిఎల్ఎ1 పులగం తిరుపతి, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు దార కళ్యాణి పాల్గొని కార్యక్రమాన్ని ముందుకు నడిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితా శుద్ధి మరియు నవీకరణలో ప్రజల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. పట్టణంలోని ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో బూత్ స్థాయి అధికారులైన బిఎల్వో లు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారమ్‌లను అందజేస్తారని చెప్పారు. ప్రతి కుటుంబం తమ వివరాలను సరిగ్గా నమోదు చేసి సమర్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ ప్రక్రియ విజయవంతమవుతుందని, ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. ముఖ్యంగా యువ ఓటర్లు, కొత్తగా అర్హత పొందిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ ఇంద్ర, బస్తీ వాసులు, స్థానిక కార్యకర్తలు, నాయకులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

## - కాంగ్రెస్ నాయకులు ఎం.ఏ. లతీఫ్

**భైంసా, జూన్ 25, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మంచిర్యాల జిల్లా అబ్జర్వర్ ఎంఏ లతీఫ్ చేపట్టిన మహా పాదయాత్ర విజయవంతంగా మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం భైంసా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఏ. లతీఫ్‌తో పాటు పాదయాత్ర బృంద సభ్యులు ఆసుపత్రిలోని వివిధ వార్డులను సందర్శించి, చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను అందజేశారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుంటూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న మహా పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమం చేపట్టడం పట్ల రోగులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖిటీమ్ ఎం.ఏ. లతీఫ్‌ఖి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు అందజేస్తున్న లతీఫ్, పాదయాత్ర బృంద సభ్యులు

# మత్తుకు దూరం.. ప్రగతికి బాటలు

## - నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, జూన్ 25, ప్రభాతవార్త:**




నిర్మల్ పట్టణంలోని దీక్ష జూనియర్ కళాశాలలో ఖిమిషన్ పరివర్తనఖిలో భాగంగా నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ వికసిత్ భారత్‌కి పెహచాన్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ.. నేటి యాంత్రిక జీవనశైలి, విద్యా ఒత్తిడి కారణంగా యువత మత్తు పదార్థాల బారిన పడటం తీవ్ర ఆందోళనకరమన్నారు. మత్తుకు బానిస కావడం అంటే జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకోవడమేనని, ఒకవేళ అలవాటు పడినా దృఢ సంకల్పంతో ఆ వ్యసనం నుండి బయటపడాలని సూచించారు. నేటి తరం మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు బానిస కాకుండా మంచి పుస్తక పఠనానికి సమయం కేటాయించాలని, శాస్త్రవేత్తలు, సంఘసంస్కర్తల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలని హితవు పలికారు. పేదరికం, చదువుల ఒత్తిడి, ఇతరులతో అనవసర పోలికల వల్లే యువత మానసిక ఆందోళనకు గురై తప్పుదారి పడుతున్నారని ఆయన విశ్లేషించారు. మనసులో వ్యతిరేక ఆలోచనలు రాకుండా నిరంతరం ఏదో ఒక అభ్యాసంలో లేదా సృజనాత్మక పనుల్లో నిమగ్నమవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో అందరితో కలిసి నషా ముక్త్ భారత్ కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరశురాం, ప్రముఖ మానసిక వైద్యులు అల్లాడి సురేష్, దీక్ష కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, అధ్యాపక బృందం, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్.ఐ.ఆర్ సర్వే గురించి అవగాహన కల్పిస్తున్న స్థానిక సర్పంచ్

## ఎస్.ఐ.ఆర్ సర్వేను పకడ్బందీగా అమలు చేయాలి

**లింగాపూర్, జూన్ 25,ప్రభాతవార్త,**

లింగాపూర్ మండలవ్యాప్తంగాఓటర్ల జాబితా పక్కగా రూపొందించడం లక్ష్యంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు బూతు లెవెల్ ఏజెంట్లు బూత్ లెవెల్ అధికారులు కలిసి సంయుక్తంగా అసలైన ఓటరు జాబితా తయారు చేయడానికి, సర్వేను అధికారికంగా ప్రారంభించారు, ప్రజాస్వామ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఓటరు జాబితాలను సక్రమంగా సర్వే చేయాలి. సర్వే ప్రారంభం సందర్భంగా లింగాపూర్ స్థానిక సర్పంచ్ జదవ్ రాజశేఖర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులకు తావు లేకుండా పారదర్శకంగా సర్వే జరగాలని అధికారులను కోరారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతి యువకులను ఓటరుగా నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు, గ్రామంలో చనిపోయిన వారి పేర్లను తొలగించడం రెండు చోట్ల ఓటర్లు గా నమోదయి ఉన్న వారిని గుర్తించి సవారించడం వంటి పనులను పక్కగా సర్వే చేయాలి, అర్హులైన ఏ ఒక్కరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పవర్ బబ్లు నాయక్, బిఆర్ఎస్ నాయకులు, జాటోత్ రాహుల్, గ్రామ సమైక్య మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఐకెపీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ దండే విఠల్

## ఐకేపీ సేవలకు శ్రీకారం

**చింతలమానేపల్లి, జూన్ 25, ప్రభాతవార్త;**

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఐకేపీ (ఇందిరా క్రాంతి పథం) కార్యాలయ భవనాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రారంభించారు. మహిళా సంఘాల అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణకు ఈ కార్యాలయం కీలక కేంద్రంగా పనిచేయనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారత, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నూతన కార్యాలయం ద్వారా మహిళా సంఘాలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అటవీ భూమిలో పోడు వ్యవసాయం

### - వ్యక్తి అరెస్ట్

**పెంచికల్ పేట్, జూన్ 25, ప్రభాతవార్త :**

అటవీ భూమిలో అక్రమంగా పోడు వ్యవసాయం చేస్తున్న వ్యక్తిని అటవీ శాఖ అధికారులు అరెస్ట్ చేసి గురువారం కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించినట్లు అటవీ అధికారులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దరోగపల్లి అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించిన అటవీ శాఖ సిబ్బంది, అదే గ్రామానికి చెందిన డాంబర్ సుధాకర్ ( 32 ) పోడు వ్యవసాయం చేస్తుండగా పట్టుకున్నారు. అతనిపై అటవీ చట్టం కింద కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లుగా ఎఫ్ఆర్వో అనిల్ కుమార్ తెలిపారు. అటవీ భూముల ఆక్రమణ, చెట్ల నరికివేతకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ రెంజర్ ముసవీర్, సతీష్, మనోహర్, కళ్యాణ్ పాల్గొన్నారు.



## గుంతలతో ప్రమాదకరంగా మారిన రహదారులు

### - అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

### - బెల్లంపల్లిలో రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

**బెల్లంపల్లి, జూన్ 25, ప్రభాతవార్త**




బెల్లంపల్లి పట్టణంలో కొనసాగుతున్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంసీపీఐయూ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్లంపల్లి పట్టణంలో కాంటా నుండి ఏరియా ఆసుపత్రి వరకు జరుగుతున్న రోడ్డు పనులు ఆలస్యమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పట్టణమంతా గుంతల మయం కావడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది అన్నారు. ప్రస్తుతం వర్షాల కారణంగా రోడ్లపై గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ప్రమాదాల అవకాశాలు మరింత పెరిగాయని, ఏదైనా అపరిస్థితి జరిగితే సంబంధిత ప్రభుత్వ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పట్టించుకోకుండా వ్యవహరించడం దురదృష్టకరమని, వెంటనే స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎంసీపీఐయూ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్, మండల కార్యదర్శి ఆరెపల్లి సతీష్, చింటూ, ఆకాష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

**బెల్లంపల్లి, ప్రభాతవార్త**



బెల్లంపల్లి పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా గురువారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం 415వ సారి ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో యాచకులు, నిరుపేదలు, కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ పుట్టినరోజు వంటి ప్రత్యేక సందర్భాలను సేవా కార్యక్రమాల ద్వారా గుర్తించటం ఎంతో ఆనందదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 180 మందికి ఒక పూట భోజనం అందించామని చెప్పారు. జనహిత అన్నపూర్ణ సేవా కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరుతూ, సహకరిస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాధురి వినయ్, అభిరామ్, ప్రభాస్, అబ్బాస్, సనత్, జనహిత సేవా సమితి కోశాధికారి కొడిపెల్లి గిరిప్రసాద్, కార్యవర్గ సభ్యులు భీమిని కనకయ్య, డోలి సుకుమార్, నిచ్చకోల గురుస్వామి, బోనాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కలిగిఉండాలి

**ఆసిఫాబాద్, జూన్ 25, ప్రభాతవార్త :**



సమాజంలో మత్తు పదార్థాల (డ్రగ్స్) దుర్వినియోగం వల్ల కలిగే తీవ్రమైన దుష్ప్రభావాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగివుండాలని సబ్ జైలు అధికారి ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక సబ్ జైలు ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా జూన్ 22 నుండి జూన్ 26 వరకు అవగాహనా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జైలులోని ఖైదీలు, సిబ్బందికి మత్తు పదార్థలకు దూరంగా ఉండేలా చూడటానికి, వాటి అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రభుత్వం, పోలీసులు విస్తృత ప్రచార కార్యక్రమాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణ దినోత్సవంకు సంబంధించిన వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ చేసి మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జైలు సిబ్బంది పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కీలక ఆదేశాలు

**- బెల్లంపల్లిలో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పర్యటన - పలు సబ్‌స్టేషన్ల పరిశీలన, అభివృద్ధి పనుల వేగవంతం**

**బెల్లంపల్లి, జూన్ 25, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రాంతంలో టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి గురువారం రోజున విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు విద్యుత్ మౌలిక సదుపాయాల పనులను పరిశీలిస్తూ, విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచడం మరియు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. మొదటగా 132/33 కేవీ బెల్లంపల్లి సబ్‌స్టేషన్‌ను సందర్శించిన సీఎండీ, వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు రెండవ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచే చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. దీని ద్వారా భవిష్యత్ విద్యుత్ అవసరాలను సమర్థవంతంగా తీర్చగలమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం 33/11 కేవీ బెల్లంపల్లి సబ్‌స్టేషన్‌లో ప్రతిపాదిత రీనోవేషన్ అండ్ మోడర్నైజేషన్ (ఆర్ అండ్ ఎం) పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత ఏజెన్సీలు, సివిల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ డివిజన్‌లోని దహెగాం నుండి బెల్లంపల్లి డివిజన్‌లోని కన్నెపల్లి వరకు నిర్మిస్తున్న 18 కిలోమీటర్ల ఇంటర్‌లింకింగ్ లైన్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ లైన్ వారంలో అందుబాటులోకి వస్తుందని పేర్కొంటూ, దీని ద్వారా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా సాధ్యమవుతుందని, అత్యవసర పరిస్థితుల్లో కూడా వినియోగదారులకు విద్యుత్ అందించగలమన్నారు. కన్నెపల్లి సబ్‌స్టేషన్‌లో కూడా ఆర్ అండ్ ఎం పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించిన సీఎండీ, అక్కడ ఆపరేషన్ సిబ్బందితో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే సమయంలో భద్రత అత్యంత కీలకమని, భద్రతా పరికరాలు లేకుండా పనులు చేయరాదని హెచ్చరించారు. పనులు ప్రారంభించే ముందు ప్రతి ఉద్యోగి కనీసం ఒక నిమిషం సమయం తీసుకుని భద్రతా ప్రమాణాలను పరిశీలించాలని సూచించారు. ఈ ఖఒక్క నిమిషం జాగ్రత్త" ద్వారా విద్యుత్ ప్రమాదాలను తగ్గించి, సిబ్బంది ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు. అలాగే ముత్తాపూర్ (మాడేపల్లి) వద్ద ప్రతిపాదిత 132 కేవీ నూతన సబ్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించిన ఆయన, భవిష్యత్ పారిశ్రామిక, వ్యవసాయ, గృహ అవసరాలకు ఇది కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రతిపాదనలను వేగవంతం చేసి తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం సంస్థ ప్రధాన లక్ష్యం. విద్యుత్ మౌలిక సదుపాయాల బలోపేతం ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం అని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. ఈ పర్యటనలో మంచిర్యాల సూపరింటెండింగ్ ఇంజినీర్ బి. రాజన్న, డివిజనల్ ఇంజినీర్ (టెక్నికల్) మల్లేశం, ఈఈ (సివిల్) శ్రీనివాస్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు శ్రీనివాస్, రవికుమార్, శరత్ కుమార్, రాంచందర్, రాజ్ కుమార్, ఏఈలు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## కనీస వేతనాల సవరణలో ప్రభుత్వాల వైఫల్యం: సిటియు

**- కాంట్రాక్టు కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి**

**- మందమర్రిలో సిటియు డివిజన్ నూతన కమిటీ ఎన్నిక**

**మందమర్రి, జూన్ 25, ప్రభాతవార్త**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్పొరేట్, పెట్టుబడిదారుల అనుకూల విధానాల కారణంగా రాష్ట్రంలో పనిచేస్తున్న సుమారు కోటి 20 లక్షల మంది కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఐక్య సంఘం (సిటియు) నాయకులు విమర్శించారు. మందమర్రిలో గంట రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కాంట్రాక్టు కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో సిటియు బెల్లంపల్లి రీజినల్ కార్యదర్శి దూలం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని 73 షెడ్యూల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు అందడం లేదన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కనీస వేతనాలను సవరించి కొత్త జీవోలు విడుదల చేయాల్సి ఉండగా, కేంద్ర ప్రభుత్వం 2022 తర్వాత కొత్త జీవోను విడుదల చేయలేదని ఆరోపించారు. కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న అనేక చట్టాలను కూడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం బలహీనపరుస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కొత్త కనీస వేతనాల జీవోలు విడుదల చేయకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నాటి జీవోలనే కొనసాగించడం కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని పేర్కొన్నారు. పాలకులు మారుతున్నా కాంట్రాక్టు కార్మికుల జీవితాల్లో మార్పు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు రాజకీయ చైతన్యంతో ఐక్యంగా పోరాటాలు నిర్వహించి తమ హక్కులను సాధించుకోవాలని సిటియు నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఐక్య సంఘం (సిటియు) మందమర్రి డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గంట రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షుడిగా, ఇప్ప ప్రభాకర్ కార్యదర్శిగా, క్యాతం భాగ్య, హన్మ శ్రీనివాస్ ఉపాధ్యక్షులుగా, బచ్చలి సురేందర్, నాగరాజు సహాయ కార్యదర్శులుగా, దుర్గ ప్రసాద్, శ్రీధర్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.





బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌ఓ) సూచనలు ఇస్తున్న ఆర్డీవో దేవీదాస్

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సర్వే ప్రారంభం

**- క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆర్డీవో దేవీదాస్**

**సారంగాపూర్, జూన్ 25, ప్రభాతవార్త:**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్) 2026 కార్యక్రమం గురువారం సారంగాపూర్ మండల కేంద్రంలో ప్రారంభమైంది. ఈ సర్వే ప్రక్రియను నిర్మల్ ఆర్డీవో దేవీదాస్ క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించి, బూత్ స్థాయి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో తహసిల్దార్ విజయ్ కాంత్ రావు పాల్గొని మాట్లాడారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, ఓటర్ల సమగ్ర వివరాలను సేకరిస్తారని తెలిపారు. ఇంటింటికి వచ్చే అధికారులకు, బీఎల్‌ఓలకు ప్రజలంతా పూర్తి సమాచారం అందిస్తూ సహకరించాలని కోరారు. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితాను జూలై 31న, సవరించిన తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 1న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. వచ్చే ఏడాది నాటికి 18 ఏళ్లు నిండిన అర్హులైన యువతీ యువకులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి వివరాలను ధృవీకరించుకోవాలన్నారు. ఈ సర్వే ద్వారా గ్రామంలో మరణించిన వారి పేర్లను, శాశ్వతంగా ఊరు వదిలి వలస వెళ్లిన వారి పేర్లను ఓటరు జాబితా నుండి తొలగిస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చైతన్య, కారోబార్ ఉమామహేశ్వర్, బూత్ స్థాయి అధికారులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ మంద మకరందు

**నిర్మల్, జూన్ 25, ప్రభాతవార్త:**



సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలోని నిర్మల్ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించడంతో పాటు కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. వంటగది, భోజనశాల, మరుగుదొడ్ల నిర్వహణ తీరును స్వయంగా పర్యవేక్షించారు. విద్యార్థుల ఆరోగ్యం, శారీరక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులను, వంట సిబ్బందిని పీఓ ఆదేశించారు. ఆహార తయారీలో, నిల్వలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించిన ప్రాజెక్టు అధికారి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా ప్రేరణాత్మక పాఠాలు బోధించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఇప్పటి నుంచే ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడాలని విద్యార్థులను ప్రోత్సహించారు. వర్షాకాలం ప్రారంభమైనందున పాఠశాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిల్వ నీటి వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వంటగది ఆవరణలో ఖాళీ స్థలాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోషక విలువలు గల ఆకుకూరలు, కూరగాయల మొక్కలను పెంచాలని సలహా ఇచ్చారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఎలాంటి రాజీ పడవద్దని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ అంబాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ ప్రారంభం

**- బీఎల్వోలకు సహకరించాలి**

**- తహసిల్దార్ ఏజాజ్ అహ్మద్ ఖాన్**

**దిలావర్‌పూర్, జూన్ 25, ప్రభాతవార్త:**

అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్ల జాబితాలో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం లక్ష్యంగా భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమం మండలంలోని గుండంపల్లి గ్రామంలో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో తహసిల్దార్ ఏజాజ్ అహ్మద్ ఖాన్ పాల్గొని మాట్లాడారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి ఓటర్ల వివరాలను సేకరిస్తారని ఆయన తెలిపారు. ఈ ప్రక్రియ అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితాను జూలై 31న, తుది జాబితాను అక్టోబర్ 1న విడుదల చేయనున్నట్లు చెప్పారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన యువతీ యువకులందరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. గుండంపల్లి గ్రామ సర్పంచ్ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ప్రతి ఒక్కరూ దీనిని వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా యువత ఈ నమోదు ప్రక్రియలో చురుగ్గా భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ రమేష్ మాట్లాడుతూ కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారు ఫోటో, గుర్తింపు కార్డు వివరాలు, ఫోన్ నంబర్ సమాచారంతో ఫారాలను పూర్తి చేసి అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు, గ్రామ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.



### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని

# కలెక్టరేట్ వద్ద టీఎస్‌యూటీఎఫ్ నిరసన

**- అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ**

**నస్పూర్, జూన్ 25, ప్రభాతవార్త**




స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పిలుపులో భాగంగా గురువారం తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, విద్యారంగ పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనను ఉద్దేశించి టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారావు చక్రపాణి, గుర్రాల రాజావేణు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ నివేదికను తెప్పించుకుని, 2023 జూలై 1 నుండి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే నూతన విద్యా విధానంను రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల మూసివేతను ఆపివేసే అవసరమైన చోట కొత్త పాఠశాలలను తెరవాలన్నారు. విద్యాహక్కు చట్టానికి సవరణలు చేసి, సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని స్పష్టం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ పి. చంద్రయ్యకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వి. కిరణ్ కుమార్, జిల్లా కోశాధికారి బి. కిరణ్, జిల్లా కార్యదర్శి బి. దేవదాస్, జిల్లా కమిటీ సభ్యులు యు. తిరుపతి, భారీక్ రావు, తిరుపతి, శ్రీనివాసరెడ్డి, రాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# యశోద హాస్పిటల్‌లో హైపర్‌సైట్‌తో క్యాన్సర్ చికిత్సలో కొత్త అధ్యాయం

**నిర్మల్, జూన్ 25, ప్రభాతవార్త:**




క్యాన్సర్ చికిత్సలో అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తెస్తూ యశోద హాస్పిటల్స్ మరో మైలురాయిని అధిగమించింది. గురువారం నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్ ప్రముఖ క్యాన్సర్ నిపుణురాలు డా. స్రవంతి రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన హైపర్‌సైట్ అడ్వాన్స్‌డ్ రేడియేషన్ మెషిన్ గురించి డా. స్రవంతి రెడ్డి వివరించారు. ఈ పరికరం కణితులను అత్యంత కచ్చితత్వంతో గుర్తించి, గుండె, ఊపిరితిత్తుల వంటి సున్నితమైన అవయవాలపై రేడియేషన్ ప్రభావం పడకుండా కేవలం క్యాన్సర్ కణజాలాలకే చికిత్స అందిస్తుందని తెలిపారు. దీనివల్ల రోగులు త్వరగా కోలుకునే అవకాశాలు పెరుగుతాయని, చికిత్సా ఫలితాలు మెరుగ్గా ఉంటాయని ఆమె పేర్కొన్నారు. ఒకప్పుడు క్యాన్సర్‌ను మరణశిక్షగా భావించేవారని, కానీ ఆధునిక సాంకేతికతతో నాలుగవ స్టేజ్ ఉన్న రోగులు కూడా సంవత్సరాల పాటు సాధారణ జీవితం గడపగలుగుతున్నారని డా. స్రవంతి రెడ్డి అన్నారు. క్యాన్సర్ అనేది ఒకే వ్యాధి కాదని, 100కు పైగా విభిన్న వ్యాధుల సమూహమని తెలిపారు. రొమ్ము, ఊపిరితిత్తులు, కాలేయం, జీర్ణవ్యవస్థ, గర్భాశయ ముఖద్వారం, ప్రోస్టేట్, రక్తం, చర్మ క్యాన్సర్లు సాధారణంగా కనిపిస్తున్నాయని వివరించారు. నోటి పూతలు, తగ్గని గొంతు నొప్పి, జీర్ణవ్యవస్థలో మార్పులు వంటి లక్షణాలు రెండు వారాల కంటే ఎక్కువ కాలం ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. దాదాపు 60 మంది రోగులు క్యాన్సర్ లక్షణాలను పైల్స్ వంటి సాధారణ సమస్యలుగా భావించి ఆలస్యంగా ఆసుపత్రికి వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి, ధూమపానం, మద్యపానం, రెస్టారెంట్లలో పదేపదే వాడిన నూనె, ప్రాసెస్ చేసిన ఆహారాలు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతున్నాయని డా. స్రవంతి రెడ్డి హెచ్చరించారు. క్రమం తప్పని వ్యాయామం, పోషకాహారం ద్వారా క్యాన్సర్ ముప్పును తగ్గించుకోవచ్చని సలహా ఇచ్చారు. క్యాన్సర్ దశను నిర్ధారించుకుని అధునాతన చికిత్స పొందేందుకు సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్‌ను సంప్రదించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో పీఆర్‌ఓ ఎ. శ్రీకాంత్, వి. లోకేష్ బాబు పాల్గొన్నారు.

# సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డిని కలిసిన టీఆర్‌వికెఎస్ ప్రతినిధులు

**- కార్మికుల సమస్యలపై వినతి**

**బెల్లంపల్లి, జూన్ 25, ప్రభాతవార్త**

టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి బెల్లంపల్లి డివిజన్ పర్యటనలో భాగంగా టీఆర్‌వికెఎస్ హెచ్58 ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రీజినల్ సెక్రటరీ ముష్క నర్సయ్య ఆధ్వర్యంలో సీఎండీకి కార్మికుల సమస్యలను వినిపించారు. ప్రధానంగా బెల్లంపల్లి డివిజన్‌లో తీవ్ర సిబ్బంది కొరత ఉందని, అందువల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అలాగే పాత మంచిర్యాల్ నుండి వచ్చే 33 కేవీ లైన్ పొడవుగా ఉండటం వల్ల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, పలుచోట్ల సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఈ అంశాలపై సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌వికెఎస్ రీజినల్ సెక్రటరీ, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ముష్క నర్సయ్య, మంచిర్యాల్ డివిజన్ ప్రెసిడెంట్ బి. దామోదర్ రాజు, మంచిర్యాల్ డివిజన్ సెక్రటరీ ఎస్. వినోద్, బెల్లంపల్లి డివిజన్ ప్రతినిధి రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే మంచిర్యాల్ జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజన్న, బెల్లంపల్లి ఇన్‌చార్జ్ డివిజనల్ ఇంజినీర్ మల్లేశం, ఏడి (టౌన్) కాటం శ్రీనివాస్, ఏడి (రూరల్) రవికుమార్, ఏఈ (టెక్నికల్), ఇతర అధికారులు హాజరయ్యారు.





సర్ ప్రక్రియను పరిశీలించి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాన్ని అందజేస్తున్న తహసిల్దార్ జ్యోత్స్న

## తాండూర్‌లో ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ ప్రారంభం

**తాండూర్, జూన్ 25, ప్రభాతవార్త :**

తాండూర్ మండలంలో గురువారం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా బూత్ లెవెల్ అధికారులు తమ పరిధిలోని ఓటర్ల ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఓటర్లు ఫారాలను సకాలంలో నింపి అందజేయాలని సూచించారు. మండలంలో ప్రారంభమైన ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను తహసిల్దార్ జ్యోత్స్న పరిశీలించారు. బి.ఎల్.వోలు ఇంటింటికి తిరుగుతూ ఓటర్లకు అందజేస్తున్న ఓటర్ నమోదు ఎన్యూరేషన్ ఫారం, సర్వే, ఫ్యామిలీ మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. ఎస్.ఐ.ఆర్.ను బి.ఎల్.వో.లు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.



చెత్త సేకరణ పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## చెత్త సేకరణపై గ్రామస్తులకు అవగాహన

**తాండూర్, జూన్ 25, ప్రభాతవార్త :**

మండలంలోని కిష్టంపేట గ్రామం 4వ వార్డులో గురువారం సర్పంచ్ సార్ల తిరుపతి ఆధ్వర్యంలో చెత్త సేకరణపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇంటి వద్దనే చెత్తను 4 రకాలుగా (తడి, పొడి, శానిటరీ హానికర) చెత్తలుగా వేరు చేసి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ లో వేయాలని సూచించారు. పంచాయతీ పరిధిలో ప్రజలందరూ పరిసరాలు పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అనిల్ కుమార్, వార్డు సభ్యులు మహంకాళి క్రిష్ణమూర్తి, మేడి కవిత, కామెర ప్రణీత్ కుమార్, ఆత్రం ఉదయ్ కిరణ్, నాయకులు కామని శ్రీనివాస్, పట్టి పోశం, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఓటరును గుర్తించి జాబితాలో చేర్చాలి

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 25, ప్రభాతవార్త :**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలనిమున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది బిఎల్లఓలతో కలిసి దస్నాపూర్, హడ్కో కాలనీలలో ఓటరు జాబితాలను ప్రారంభించి, ఇంటింటికీ వెళ్లిపరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలను పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా చూడాలని బీఎల్ఓలకు సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడికి ఆ హక్కు అందేలా రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణల ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు, సాలం బిన్ అహ్మద్, బాలకృష్ణ, వార్డు ఆఫీసర్ మానస, బీఆర్ఎస్ నాయకులు అశోక్, సాయి, బీఎల్ఓలు లక్ష్మీ, భాగ్యలక్ష్మి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఓటరు జాబితాను ప్రారంభిస్తున్న చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్



## ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందే వరకు కృషి చేస్తాం

### - మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్

నస్పూర్, జూన్ 25, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో ప్రతి పేదవాడికి ఇల్లు అందే వరకు స్థానిక శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో కృషి చేస్తామని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ పేర్కొన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కిస్టాపురం మంగమల్లేష్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు. మంచిర్యాల నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని ఈ సందర్భంగా మేయర్ వెల్లడించారు. పేదలకు సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని మేయర్ ధర్ని మధుకర్ వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు దక్కేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. గృహప్రవేశం చేసిన లబ్ధిదారుల కుటుంబ సభ్యులు నూతన ఇల్లు సమకూరడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేయర్‌తో పాటు స్థానిక కార్పొరేటర్ సురిమిల్ల సౌమ్య వేణు, కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధికారి, హౌసింగ్ బోర్డు అధికారులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సరిచూసుకోవాలి: మేయర్ ధర్ని మధుకర్

### - మంచిర్యాల 32వ డివిజన్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభం

నస్పూర్, జూన్ 25, ప్రభాతవార్త

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కుకు సంబంధించిన పత్రాలను నింపి స్థానిక బీఎల్ఓలకు అందజేయాలని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 32వ డివిజన్ ఏఎస్ఆర్ఆర్ నగర్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓటర్లకు సవరణ కార్యక్రమానికి సంబంధించిన పత్రాలను అందజేసి అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు జాబితాలో తప్పులను సరిదిద్దుకోవడానికి ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని మేయర్ ధర్ని మధుకర్ వివరించారు. జాబితాలో పేర్ల మార్పులు, చేర్పులు, చిరునామా సవరణల కోసం పౌరులు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేయర్‌తో పాటు కార్పొరేటర్లు సంపత్ రెడ్డి, కర్ర శ్రీను, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



# మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

భైంసా, జూన్ 25, ప్రభాతవార్త

జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో భైంసా మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌తో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాలను వారు సందర్శించి, వాటి ప్రస్తుత స్థితిగతులను, సదుపాయాలను పరిశీలించారు. ఈ వారాంతంలో జరగనున్న మంత్రి పర్యటన సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న తుది పనులను యుద్ధప్రాతిపదికన వెంటనే పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం కాలనీల్లోని అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అంతకుముందు భైంసా మున్సిపాలిటీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇన్‌ఛార్జ్ మంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొని పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, మున్సిపల్ చైర్మన్ తుమోళ్ళ దత్తు, మున్సిపల్ కమిషనర్ సిద్ధిఖా ఖుతీజా, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## డ్రగ్స్‌కు నో చెప్పాలి... జీవితానికి ఎస్ చెప్పాలి

### - మందమర్రిలో యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు

మందమర్రి, జూన్ 26, ప్రభాతవార్త

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మందమర్రి పట్టణంలోని సింగరేణి కాలరీస్ ఎయిడెడ్ హైస్కూల్ (కళ్యాణిఖని)లో ఈగల్ ఫోర్స్ తెలంగాణ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, మందమర్రి సీఐ రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, నేటి యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముక వంటివారని, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల వ్యసనాలు జీవితాలను నాశనం చేస్తాయని, క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, సరైన కెరీర్ ప్రణాళికతో జీవితంలో విజయాలను సాధించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం లేదా సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు లేదా యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్ 1908కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బందితో కలిసి ఖగమాదకద్రవ్యాలకు నో చెప్పుదాం - జీవితానికి ఎస్ చెప్పుదాం" అంటూ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే మాదకద్రవ్యాల వల్ల శరీరంపై కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పోలీసు సిబ్బంది, సింగరేణి, కార్మెల్, లిటిల్ ఫ్లవర్, శ్రీచైతన్య, కృష్ణవేణి, మాంటిస్సోరి తదితర పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మె తప్పదు: వాసిరెడ్డి సీతారామయ్య

### - కేంద్ర అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సమక్షంలో ముగిసిన సింగరేణి యాజమాన్యం, ఏఐటీయూసీ చర్చలు

### - తదుపరి సమావేశం జూలై 10వ తేదీకి వాయిదా

నస్పూర్, జూన్ 25, ప్రభాతవార్త

సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలు, పెండింగ్ డిమాండ్లపై యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే సమ్మెకు వెళ్లడం తప్పదని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య స్పష్టం చేశారు. కార్మికుల ఉద్యోగ భద్రత, సంక్షేమ అంశాల పరిష్కారం కోసం ఈ నెల 8వ తేదీన ఇచ్చిన సమ్మె నోటీసుపై గురువారం హైదరాబాద్‌లో కేంద్ర అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (ఏఎల్సీ) డాక్టర్ శాశ్వతి రథ్ సమక్షంలో సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో కార్మికుల న్యాయమైన 31 డిమాండ్లు, అమలు కాని ఒప్పందాలు, యాజమాన్య వైఖరిపై ఏఐటీయూసీ ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తి లేదని, అవసరమైతే ఉధృత పోరాటాలకు సిద్ధమని ఈ సందర్భంగా సీతారామయ్య ప్రకటించారు.

### జూలై 10వ తేదీకి తదుపరి సమావేశం వాయిదా..

గురువారం ఉదయం ప్రారంభమైన ఈ రాజీ చర్చల్లో కార్మికుల సమస్యల తీవ్రతను, వాటి ప్రభావాన్ని ఏఐటీయూసీ నాయకులు లేబర్ కమిషనర్‌కు వివరంగా వివరించారు. దీనిపై సింగరేణి యాజమాన్యం తన అభిప్రాయాలను వెల్లడించింది. ఇరుపక్షాల వాదనలను విన్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్, ఈ 31 ప్రధాన డిమాండ్లపై మరింత లోతైన చర్చలు అవసరమని భావించారు. ఈ క్రమంలోనే తదుపరి చర్చల సమావేశాన్ని జూలై 10వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ చర్చల్లో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శి కే. సారయ్య, సింగరేణి యాజమాన్యం తరఫున ఏజీఎం (పర్సనల్) అజయ్ కుమార్ హాజరయ్యారు.

